కథానిక

# కృతజ్ఞత?

యన్. ఆర్. నంది

రామ్మూర్తిబాబుగా రిచ్చిన నాలుగు మోతాదులతో రాము జ్వరం నిమ్మళించింది. ఇప్పుడు కొస్త తిరుగుతున్నాడు గూడ! రెండు రోజుల క్రితమైతే మంగమ్మకి అసలు కొడుకు బతుకుతాడనే ఆశే లేదు. మూసిన కన్ను తెరిచేవాడుకాడు. పక్కకు బల్లిలా అలా అంటుకొని వుండిపోయేవాడు. వొళ్లు అగ్గిలా సలసలా కాలిపోతూండేది. ఇప్పుడు రామ్మూర్తి బాబు చేతి చలవ వల్ల జ్వరం తిరుగుముఖం పట్టింది. అయినా జాగ్రత్తగావుండడం మంచిది.

కాని మంగమ్మకి ఇటో కన్ను అటో కన్ను. తన కొడుక్కి జ్వరం తగలకముందు రెండు రోజుల పూర్వమే జానకమ్మగారి కొడుకు, వాసు బాబుకి జ్వరం వొచ్చింది అప్పటినించీ- తనా యింట్లో పనిమనిషి గాబట్టి ఇరవై నాలుగు గంటలూ అక్కడే వుండి. అవసరం వచ్చినప్పుడల్లా మందులకని మాసులకని యిక్కడికీ అక్కడికీ పరుగెడుతోంది. ఇంతలోనే తన కొడుక్కి గూడ జ్వరం రాగానే మంగమ్మ అటు వాసుబాబు మందుకీ, యిటు తనకొడుకు మందుకి పరుగెడుతూ, విరామం లేకండా వుండటంవల్ల ఒక్కొక్కప్పుడు, రెండు, మూడేసి పూటలు పస్తులు గూడ వుంటోంది. వాసు బాబుకి మందిచ్చే రామ్మూర్తి బాబునే ఒకసారి బతిమాలి తనింటికి తీసుకొనివెళ్ళి కొడుకుని చూపించింది. రామ్మూర్తిబాబు మంచివారు గాబట్టి, రాముకి డబ్బు పుచ్చుకోకండానే నాలుగు మాత్రలిచ్చారు. రెండు రోజుల్లోనే రాము తేరుకొన్నాడు. కాని వాసుబాబు జ్వరం రోజురోజుకి తీవ్రమైపోతోంది.

ఆవాళ మధ్యాహ్నం మూడింటికి దంపుడు బియ్యం కాసిని కడిగి పొయ్యిమీద పెట్టి, ఆ వుడికిన అన్నంలో కొద్దిగా పాలేసి, రామ్మూర్తి బాబు చెప్పినట్టు, కొడుక్కి పెట్టింది. పాపం! దాన్నే కొడుకుఎంతోఆప్యాయంగాతిన్నాడు. తిన్నతర్వాత, కాసేపు పడుకోనివ్వకుండా చేసి సాయంకాలమయేసరికి, కొడుక్కి కొస్త గంజి పట్టి, మందు తాగిన తర్వాత సీసా మూతవేసి, జానకమ్మ గారింటికి బయలుదేరింది మంగ- తన కొడుకుని ఒంటరిగా వొదిలి అక్కడికి వెళ్ళడానికి మనసు చివుక్కుమన్నా. ఏం చెయ్యగలదు. అది తన ధర్మం. ఇరవైఏళ్ళనించి ఆ యింట్లో పనిచేస్తూ, వాళ్ళ ఉప్పు తింటోంది గాబట్టి.

"అమ్మా! నాకు కూరేసి అన్నం ఎప్పుడు పెడతావే?" అని హీనస్వరంతో వెళ్ళిపోతున్న తల్లిని కేకేసి అడిగాడు.

పాపం! కొడుకు నాలుగ్ రోజుల జ్వరానికే కూరా అన్నంమీద ఎంత వాచిపోయాడు అనుకొంటూ తిరిగి కొడుకుదగ్గరకివచ్చి "రాత్రికి నేను మళ్లావొచ్చి నీకు పాలు కలిపిస్తాను. అవి తాగి పడుకున్నావంటే, తెల్లారేసరికల్లా నీ జరమంతా పోతుంది. రేపొద్దుట పది టంగ్ మనేప్పటికి అన్నం వొండి పెట్టేస్తాను. ఏం? పడుకో యిప్పుడు?" అని దీపం ఒత్తి కొస్త పెద్దదిచేసి, కాళ్ళదగ్గరి దుప్పటి గుండెలవరకూ కప్పి, వెళ్ళిపోయే ముందు మళ్లా ఒకసారి ముద్దు పెట్టుకొని, విడవలేక విడవలేక జానకమ్మగారింటివేపు పయనమయింది.

తనకి యిష్టం లేకపోయినా జ్వరంతో వున్న కొడుకుని విడిచిపెట్టి యజమానులింటికి వెళ్ళవలసి వస్తోంది. ఇది మామూలు సమయమయితే అక్కడికి వెళ్లకపోయినా, జానకమ్మగారు ఏమీ అని వుండేవారు కారు. అసలు తన కొడుక్కి జ్వరమనే సంగతి వింటేనే ఆమె మంగమ్మని: "నీ కొడుకు జ్వరం నిమ్మళించే వరకూ యిక్కడికి రానవసరంలేదు లేవే మంగా" అని వుండేవారు. కాని యిప్పుడా యింటోగూడ ఆమె కొడుక్కి జబ్బుగావుంది. తన అవసరంగూడ చాల వుంటుంది. అయినా

తను తన కొడుకోసం యింటిదగ్గర వుండి పోతే ఏం బావుంటుంది? రాము జ్వరంగూడ బాగ తగ్గిపోయింది. రేపటికి వాడూ లేచి తిరుగుతాడు. ఈ ఒక్క రాత్రి తను జానకమ్మగారింట్లో వుండిపోతే రాముకేం ఫర్వాలేదు-అని గుండె ధైర్యంచేసుకొని అక్కడికి చేరుకొంది.

బయట మెట్లెంకా యిలా ఎక్కుతోంది మంగమ్మ. అంతలోనే లోపలినించి గొల్లుమనే ఏడుపు వినిపించింది. అన్ని గొంతుకలకంటే జానకమ్మగారి కేకలు చాల గట్టిగా వినిపిస్తున్నాయ్. గుండెలు బాదుకొంటూ ఏడుస్తోంది. మంగమ్మ కాళ్ళు వొణికిపోయాయి. శరీరం తూలిపోతున్నట్టనిపించింది. లోపలికి కంగారుగా వెళ్ళింది,

మంచంమీద వున్న వాసుబాబుకి స్పృహ లేదు. నిలువుచూపుతో కళ్లు సగం మూతలు పడివున్నై. ఇంట్లోవాళ్ళందరూ గగ్గోలు పెట్టేస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూడగానే మంగమ్మ కళ్లు తిరిగిపోయాయి. అయితే వాసుబాబు ఇక పోయినట్లే? అతనొక్కడే లేకలేక పుట్టాడు, జానకమ్మగారికి. ఇప్పుడతను చేతి కందొచ్చి చివరికి ఈవిధంగా అయిపోతే ఆమెగారు బతుకుతారా? కృష్ణమూర్తి గారెలా వుండగలరు? ఆయనకి వృద్ధాప్యం సమీపించింది. ఇకనించీ కొడుకే అన్నిపనులూ చూసుకొంటాడని పొంగిపోతున్న ఆయన, వాసుబాబు మరణంతో కృంగిపోడూ. పక్కనే గ్రామవైద్యులు రామ్మూర్తిగారు తలొంచుకొని నిలబడివున్నారు. ఆయనపక్కనే కృష్ణమూర్తిగారు.

"కృష్ణమూర్తిగారూ, మీరు త్వరగా పట్నానికి ఎవరినైనా పంపించి ఒక డాక్టర్ని రప్పించండి. నాకు చాతనయినంత వరకూ ప్రయత్నించాను. నా మందులకా రోగం నయంకాలేదు. అ లా జబ్బేమిటో గూడ నేను కనుక్కోలేక పోయాను. అందువల్ల మీరు ఆలస్యం చేయక ఎవరినైనా పట్నం త్వరగా పంపించండి" అన్నారు రామ్మూర్తిబాబుగారు.

కృష్ణమూర్తిగారు కాసేపు తటపటాయించారు. నాలుగుమైళ్ళ దూరం పట్నానికి ఎవరు వెడతారు? నాలుగు మైళ్లు ఏమంత దూరం కాకపోయినా, ఈ సమయంలో ఎవరు వెడతారు? పోనీ సమయానికి నరసయ్యకూడాలేడు. ఊళ్ళో. అందరూ అమ్మవారి పండగసందడిలో వున్నారు. ఆసరదాని వొదులుకొని, ఆపళంగా లక్ష రూకలిస్తామన్నా ఎవరూ కదలరు. అయితే తన కొడుకు అలా గింజుకొంటూ ప్రాణాలు విడవవలసిందే? పోనీ తనే ఎలాగో వెడదామంటే కళ్లు సరిగా అగుపించవు. అందరూ ఆడవాళ్ళే. కృష్ణమూర్తిగారి తల తిరిగిపోతోంది. ఆ స్థితిలో ఆయన కళ్ళనించి నీళ్లు గూడ తిరిగాయి. అంతలో మెరుపులా మంగమ్మ ఆయన కళ్లల్లో పడింది.

"మంగమ్మా! నువ్వు రామ్మూర్తిగారు చెప్పిన మాటలు విన్నావుకదూ? పట్నం వెళ్ళి డాక్టరు సుందరంగారిని, ఈ రోడ్డుమీంచి తిన్నగా వెళ్ళిపోతే పట్నానికి మొదట్లోనే ఆయన యిల్లు కనిపిస్తుంది, నేను రమ్మన్నట్టు చెప్పు. త్వరగా వెళ్లు వాసు బాబు తప్పకండా బతుకుతాడు" అంటూ కృష్ణమూర్తిగారు మంగమ్మ దగ్గరికొచ్చి బతిమాలారు. ఆ సమయంలో ఎవరి కాళ్ళయినా సరే పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు ఆయన.

మంగమ్మ యజమాని కోరికను నెరవేర్చాలనుకొంది. తను ఆ యింట్లో యిరవైయేళ్ళనించి వుంటోంది. తన భర్త చనిపోయిన తర్వాతగూడ వాళ్ళే తనకి ఆశ్రయమిచ్చారు. తన రాము చదువుకోవడానికిగూడ వాళ్ళే బడి జీతాలు కడుతున్నారు. ఇప్పుడు తను వెళ్ళి డాక్టరుని తీసుకవస్తే తన కొడుకు భవిష్యత్తు మరీ సుఖంగా వుంటుందనుకొని పట్నానికి వెళ్లడానికి సిద్ధమయింది.

రామ్మూర్తిబాబు కృష్ణమూర్తిగారి దగ్గరకి వచ్చారు. "అదేం వెళ్లగలదండీ, ముసల్ది. అందులో దానికి కళ్లుగూడ సరిగా ఆనవ్. ఈ దారివిడిచి మరోదారి పట్టిందా, అసలుకే ముప్పు" అన్నారు.

"మరేం చేయాలండీ? ఇంతకుమించి మరి వేరే దిక్కులేదు. ఆయనే ఎలాగో కష్టపడి వెడతారాంటే, ఆయనకిగూడ కళ్లు సరిగా కనిపించవు. ఊళ్ళో ఎవరినయినా బతిమాలుదామంటే, నిలువునా కనకం కురిపించినా ఒక్కడు

కూడా నూకమ్మతల్లి సంబరం పోదులుకోనిరాదు. మరేం చేయాలి? దాన్నే వెళ్ళనివ్వండి" అంది జానకమ్మ మెల్లగా.

రామ్మూర్తిబాబు కాసేపటివరకూ ఏమీ మాటాడలేదు. కృష్ణమూర్తిగారు ఆమెకు తిరిగి డాక్టరుగారి యిల్లు ఆనవాలు చెబుతున్నారు. మంగమ్మ శ్రద్ధగా ఆలకిస్తోంది. రామ్మూర్తిబాబు ఏదో తలపుకొచ్చినట్టు కృష్ణమూర్తిగారి దగ్గరకి వచ్చారు.

"లేకపోతే ఒకపని చేయగూడదు మంగా?" అన్నారు.

కృష్ణమూర్తిగారూ, మంగమ్మా, ఆయనకేసి ఏమిటన్నట్టు కంగారుగా చూశారు.

"నీకొడుకు రాము వున్నాడుగా...?"

"అవునవును" అని, కృష్ణమూర్తి ముఖం యింత చేసుకొని అన్నారు.

"రామే!" అని కళ్లు పెద్దవిచేస్తూ భయంగా అరచింది. "ఆడికి జరం బాబు...మీరేకదూ మందిస్తున్నారు?"

"ఓ! ఫర్వాలేదు. వాడి జ్వరం నిన్ననే పోయింది. ఇప్పుడు వాడి లేచి తిరగగలడు. నువ్విప్పుడు వెళ్ళావంటే దార్లో ఎన్నో చీలిక దార్లున్నాయి. ఒకదార్ని వెళ్ళబోయి, ఇంకో దార్ని వెళ్ళావా ఇక నువ్వు వొచ్చినట్టే..." అన్నారు రామ్మూర్తి బాబు.

"ఫర్వాలేదు. నేనెలాగో కష్టపడి ఎల్తాను. వాణ్ణిగాని ఇప్పుడు లేపామా?..." మంగమ్మ ఆరాటంగా అంటోంది.

"సరే మీ యిష్టం..." అంటూ వెనక్కి తిరిగిపోయారు రామ్మూర్తిబాబు. కృష్ణమూర్తిగారి గుండె గతుక్కుమంది. మంగమ్మ దగ్గరికి వెళ్ళారు.

"మంగమ్మా! రామ్మూర్తిగారే మందిస్తున్నారు కదా, ఆయనకంటే మనకి బాగా తెలుసేవిటి? నీ కొడుకు జ్వరం పూర్తిగా తగ్గిపోయిందని ఆయనంటున్నారుగా. నువ్వు మామీద దయ చూపి, వాణ్ణి అక్కడికి పంపించు. వాడికి ఆదారి ఆలవాటే గాబట్టి ఒక్క నిమిషంలో పరుగెత్తుక వచ్చేస్తాడు."

జానకమ్మ గూడ మంగమ్మని ఎంతో బతిమాలారు. చివరికి ఏడ్చారు గూడ! ఆమె ఏడుపుకి మంగమ్మ కళ్లనించి నీళ్లు గిర్రున తిరిగాయి. ఒకపక్క తన యజమాని కృతజ్ఞత, రెండో పక్క తన కొడుకుపై మమత. తను తిన్న యింటిని కాల్చే కృతఘ్నురాలు కాదు. తన కొడుకుని ఆయన పట్నంలో ఎనిమిదో క్లాసు చదివిస్తూంటేనే ఆయన ఋణం ఎలా తీర్చుకోవాలని రేయింబవళ్లు సతమతమవుతున్న మంగమ్మ, యిప్పుడు ఆ యజమానే చేతులు పట్టుకొని బతిమాలుతూంటే మిన్నకుండడం తన కృతఘ్నతని ధైర్యంగా ఆయనముందు వ్యక్తపరచడం కాదూ?

ఇక చివరికి మంగమ్మ మౌనంగా వుండిపోగానే, కృష్ణమూర్తిగారు దగ్గరకి వచ్చి "పోనీ మంగమ్మా. నీ కొడుకు మీది మమకారం నిన్నలా చేసింది. ఐనా మా కంగారు మాది గాబట్టి నీ కొడుకు జబ్బునిగూడ మేము లెక్క చేయకండా నిన్ను బలవంతం చేస్తున్నాం. రామ్మూర్తిగారు అనబట్టి నేనలా అన్నాను. సరే నీ యిష్టం. నువ్వే వెళ్లు" అని అన్నారు.

"మీకేం పిచ్చాండి! వాడిజ్వరం పూర్తిగా తగ్గిపోయింది. నాకు తెలుసు... పోనీఇప్పుడు అక్కడికి వెడదాం. వాడులేచి తిరుగుతూంటే వాడితో యీ సంగతి చెప్పి, వాడు ఒప్పుకొంటేనే అక్కడికి పంపిద్దాం. ఏమంతదూరం పని? నాలుగు మైళ్లు. వెన్నెలరాత్రి" అన్నారు రామ్మూర్తి బాబు.

"అవునవును యిది బాగుంది. వాడు ఇంతకీ 'వెళ్ళలే'నంటే - ఏలాగో ఓలాగు అవుతుంది" అంటూ కృష్ణమూర్తిగారు మంగమ్మని తీసుకొని ఆమె యింటికి బయలు దేరారు.

"ఏమో, వాడి కాలు ఒక్కనిమిషం వుండబట్టదు. వెన్నెలని బయటికొచ్చి పండగ వేషాలని చూస్తున్నాడేమో!" అని మంగమ్మ దారి పొడుగునా అనుమానిస్తున్నట్టే రాము, యింటి ముందు నిలబడి దూరాన గంతులేస్తున్న పిల్లల్ని చూస్తున్నాడు.

కృష్ణమూర్తిగారు రాము దగ్గరకి వెళ్ళి సంగతంతా చెప్పి "వెడతావా?" అని ప్రశ్నించారు. రాము ముందు తల్లికేసి చూసి చిరునవ్వు నవ్వి "సరే" అన్నాడు. పైన విరియ కాస్తున్న వెన్నెల. నాలుగు రోజులనించి యిల్లు కదల

లేదేమో కృష్ణమూర్తిగారు యిలా అని చెప్పగానే సంతోషంతో ఒప్పుకొన్నాడు. మంగమ్మ గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. వాడికేం తెలుసు? వెన్నెలని, రోడ్డుమీదనడకని సరదా పడి అలా ఒప్పుకొన్నాడని, మంగమ్మ ఏమీ మాటాడలేక పోయింది. లోలోనే ఎంతో ఏడ్చింది.

రాము చొక్కా వేసుకొని బయలుదేరాడు. కృష్ణమూర్తిగారు తృప్తిగా నిట్టూర్పువిడిచారు. ఇక మంగమ్మ సహించలేక పోయింది. తనకి పుట్టిన ఐదుగురు పిల్లలూ పోయి చివరికి రాము ఒక్కడు మిగిలాడు. వీడు గూడ పోతే తనేం అవుతుందిక? కృష్ణమూర్తి బాబుని "బాబు! వాణ్ణి పంపించకండి. సగం దార్లో మొగం తిరిగి పడిపోతాడు" అని అనలేక, "బాబు! వాడొక్కడూ వెళ్ళలేడు. నేను వాడి వెనకాలే తోడు వెడతా"నంది.

కృష్ణమూర్తిగారు మొదట సరే అన్నా తర్వాత ఏదో జ్ఞాపకానికి వచ్చినట్టు వెనక్కి తిరిగి "నువ్వెళ్ళొద్దు మంగమ్మా. ఇంటి దగ్గర నీ అవసరం చాలా వుంటుంది. అదిగాక నీ నడక వాడి నడకతో సరిపోదు. ఆలస్యమయి పోతుంది" అన్నారు.

మంగమ్మ మరిక మాటాడలేకపోయింది. మన సెంత లాగుతున్నా మాటాడకండా యజమాని వెనకాలే వెళ్ళిపోయింది.

నాలుగు రోజులనించి కాళ్లు కట్టి యింట్లో పడేశారు. ఇప్పుడు పోనీ దూరమయితే అయింది, సరదాగా వెన్నెల్లో, రోడ్డుమీంచి నడుచుకొంటూ పట్నం వెళ్ళొచ్చు. ఆ వంకమీద కాసేపు ముందుగా వెళ్ళి అమ్మవారి సంబరం గూడ చూడొచ్చని రాము కృష్ణమూర్తిగారు అడిగిందే తడవుగా పట్నం బయలుదేరాడు... అమ్మవారి సంబరం దగ్గరకి చేరుకొన్నాడు. అక్కడ మాదిగాళ్లు డప్పులు వాయిస్తోంటే, పిల్లలు కాళ్ళకి మువ్వలు కట్టుకొని, ఆ శబ్దానికి లయసరిపోయేట్టు ఛెంగుఛెంగున గెంతుతున్నారు. వాళ్ళని చూడగానే రాము యిక అలా నిలబడలేక, వాళ్ళల్లో కలసిపోయి మైమరచి ఎంతసేపో గెంతాడు.

డప్పు లాపారు. రాముకి అప్పుడు జ్ఞాపకానికి వచ్చింది. తన్ని కృష్ణమూర్తిగారు పట్నం వెళ్ళి త్వరగా డాక్టర్ని తీసుకరమ్మన్నట్టు. ఆ మాట జ్ఞాపకానికి రాగానే గబగబా పట్నం వేపు పరుగుతీశాడు.

పిల్లలందరితోనూ సరదాగా గెంతగానే కొత్తగావున్న రాము జ్వరం ఎక్కడిదక్కడ పటాపంచలై వొళ్ళంతా చెమటపట్టి హుషారు వాడయిపోయాడు. కాని సగం దూరం పరుగున వెళ్ళబోయేసరికి వొళ్ళంతా తిరుగుతున్నట్టనిపించింది. అయినా లెక్కచేయకండా కాసేపు పరుగెడుతూ కాసేపు నడుస్తూ చివరికి పదిగంటలకి డాక్టరింటికి చేరుకొన్నాడు.

ఇంటిదగ్గర డాక్టరు లేరు. రాముగుండెల్లో రాయిపడ్డట్టయింది. తను ఇంటిదగ్గర నించి అమ్మవారి సంబరం దగ్గర వెళ్ళివుండకపోతే ఇంత ఆలస్యమయి వుండేదికాదు. డాక్టరుగారు గూడ ఇంట్లో వుండివుండేవారు. మళ్లా ఆయన ఎప్పుడు తిరిగొస్తారో తెలీదు. కళ్లు మూసుకపోతున్నాయి. వొళ్ళంతా బరువుగా అయిపోతోంది. కాళ్లు నొప్పిగా ముడుచుకు పోతున్నాయి. అలా గోడకానుకొని కూచుండిపోయాడు రాము. కళ్లు మూసేడు. రెప్పలు బరువుగా వున్నై. ముక్కునించి శ్వాసవేడిగా వస్తోంది. తలలో నరాలన్నీ మెలికలు తిరిగిపోతున్నట్టయి పోతున్నాయ్. మూలుగుతూ తల ఈ పక్కనించి ఆపక్కకి తిప్పుతున్నాడు. తల బరువుగా వాలిపోతోంది.

పదకొండు అవుతోందనగా కారుమీద



డాక్టరు వొచ్చారు. కారు శబ్దం నిద్రపోతున్న రాముని లేపింది. తనిక్కడికి ఎందుకొచ్చాడో ఆ కార్యాన్ని ఆ కారుదీపాలు జ్ఞాపకంచేసినై. లేచాడు. తల ముందుకీ వెనక్కీ వాలిపోతోంది. కారులోంచి దిగుతున్న డాక్టరుకి ఎదురుగా వెళ్ళాడు. నమస్కారం చేసి ఏమిటి, ఎలా చెప్పాడో అతనికి గుర్తులేదు. ఆయన 'సరే వస్తాను వెళ్లు' అంటూ లోపలికి వెళ్లిపోయారు.

ఇప్పుడు తను పట్నం వచ్చిన పని అయిపోయింది. ఇక తను యింటికి తిరిగి వెళ్ళిపోవచ్చు. ఇంటికి వెళ్ళగానే అమ్మ పొయ్యిమీద పెట్టిన మీగడ పాలిస్తుంది. అవి తాగి హాయిగా నిద్రపోతే, తెల్లవారి పదయేసరికల్లా మంచి కూరతో అమ్మ అన్నం వండి పెడుతుంది. తను మామూలు వాడయిపోతాడు. స్కూల్‌కి వెడతాడు. పాఠాలు చదువుకొంటాడు. ఆడుకొంటాడు. మళ్లా అమ్మ రాత్రికి పాలు కాచియిస్తే తాగి నిద్రపోతాడు.

బయలుదేరాడు. తిరుగుప్రయాణం. తనింటికి. అమ్మ తనకోసం ఎదురు చూస్తూంటుంది. కృష్ణమూర్తిగారు డాక్టరుకోసం ఎదురు చూస్తూంటారు. డాక్టరుగారు వెళ్ళి వాసుబాబుగారిని బతికిస్తారు. తను అంత శ్రమపడి నాలుగు మైళ్లు పరుగెత్తబట్టే ఆయన బతుకుతున్నారు. ఆయన మళ్ళా లేచి మామూలుగా తిరుగుతూంటే జానకమ్మగారు తన్నెంతో పొగుడుతారు. కృష్ణమూర్తి బాబుగారు తన్నింకా చదివిస్తారు. డాక్టరుగారు వస్తున్నట్టు, ఆయనకంటే ముందు వెళ్ళి చెప్పాలి. పరుగెత్తితే అరగంటలో అందిపోతాడు.

కాళ్ళకి ఆజ్ఞ దొరికింది... కాని నరాల్లో నీరసం ఎక్కువై పోతోంది. ఎముకల్లోమూలుగు ముద్దగా మారిపోతోంది. అయినా వీట్లెక్కేమిటన్నట్టు కాళ్లు పిచ్చిగా పరుగెడుతూనే వున్నాయ్. క్షణక్షణానికి ఊపిరి పెద్ద శబ్దం చేసుకొంటూ నిట్టూర్పులై బయటకు వెలువడుతోంది. అయినా రాము మొండిగా ఆ ఎర్ర మన్ను రోడ్డుమీద వెర్రిగా పరుగెడుతున్నాడు.

అప్పుడేమూడు మైళ్లుపరుగెత్తేశాడు. ఇంకెంత. మరో మైలు... దూరాన గ్రామంలో అమ్మవారి సంబరంలోని కాగడాలు వెలుగుతున్నాయి... రాముకి కాళ్లల్లో నొప్పి ఎక్కువైపోయింది. పరుగుమానేశాడు మెల్లగా నడక ప్రారంభించాడు. పక్కనే ఒక నక్క కూసినట్టనిపించింది. కళ్ళముందు ఒక శవం కాలుతున్నట్టు అగుపించింది. తల మీద గుడ్లగూబలు తన్నినట్లు భ్రమించాడు. పక్కనించి ఏవో వికృతాకారాలు తన్ని చేతులు పట్టుకొని లాగుతున్నట్లు భయపడ్డాడు... ఎప్పుడూ తన కలాంటి భయాలే కలుగలేదు... ఇప్పుడిదేమిటి? చుట్టూ భయంకరాకారాలే! గుండె తీవ్రమయింది. బెదిరిపోయి పెద్ద పిచ్చి కేక వేశాడు. వెంటనే తనకి తెలీకండానే తన కాళ్లు తన్ని సునాయాసంగా మోసుకుపోయి కృష్ణమూర్తిగారి యింటిముందు వాలిపోయేట్టు చేశాయి.

మెట్ల దగ్గరికి వచ్చాడు రాము. సరిగా అప్పుడే డాక్టరుగారి కారుగూడా చేరింది. కృష్ణమూర్తిగారు గబగబావచ్చి డాక్టరుగారిని తీసుక వెళ్ళారు. రాము ఆమెట్లమొగల్లోనే చేరబడి పోయాడు. ఇప్పుడు ప్రపంచమంతా విశ్రాంతి తీసుకున్నట్టనిపించింది రాముకి.

డాక్టరు లోపలికి వెళ్ళారు. మంగమ్మ డాక్టర్ని చూడగానే తన కొడుకుకోసం బయటికివచ్చింది ఆతుర్దాగా. డాక్టరుగారు వాసుబాబు చెయ్యిచూశారు. గుండెని పరీక్షించారు. కాసేపయిన తర్వాత "ఫర్వాలే"దని సంచిలోని ఒక సూదిని తీశారు.

ఇంతలో బయట పిడుగుపడ్డట్టు గొల్లుమని గోడన వినిపించింది. కృష్ణమూర్తిగారు తొట్రుపాటుతో బయటికి వచ్చారు.

పైన వెన్నెల. గ్రామమంతా పిండారబోసినట్టుంది. కిందికి చూశారు. మెట్ల మొగలో మంగమ్మ మెట్లకి తల నేసి బాదుకొంటూ ఏడుస్తోంది. ఆమె ఒళ్ళో రాము ఉన్నాడు. కృష్ణమూర్తిగారు గబగబా మెట్లుదిగి కంగారుగా మంగమ్మకేసి చూశారు. ఆకాశం నించి పేలగా పడుతున్న ఋక్షకాంతి, మంగమ్మ ఒడిలోని రాము మెడ వాలిపోయినట్టు ఋజువిచ్చింది.